# శిలలో సెలయేరు

**- వేంపల్లి అబ్దుల్ ఖాదర్.**

కలికిరిలో 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' ఆగింది. బ్రీఫ్‌కేస్‌తో స్టేషన్ బయటికొచ్చాను. చిరుజల్లు... స్వాగతం పలికింది. ఏవిటో...

సైబీరియన్ వక్షుల్లా ముసురుతున్న ఆలోచనలు. ఎందుకో... మనసంతా అదోలా ఉంది- మబ్బు పట్టిన ఆకాశంలా ఉంది- విచిత్రం!

ఆకాశం నిజంగానే మబ్బు పట్టింది!

\- - - - -

"అమ్మోవ్! అన్నయ్యొచ్చాడే!"

రాధ ఎగిరి గంతేసింది. అదెప్పుడూ అంతే. గుండె నుంచి పొంగే నిజమైన ఆనందం దానిది!

అమ్మది మరీను!

ఇక్కడ నాకు చిన్న దెబ్బ తగిలిందంటే, అక్కడ ఆమె కెవ్వుమంటుంది.

''ఏవిటీ, ఈ వానలోనా?'' అంటూ ఆవురుమని వచ్చిన అమ్మ, నన్నలా పరకాయించి చూసి, "అబ్బాయ్! వానలో తడుస్తూనా? జలుబు చేయదుట్రా? ఏవిటి నువ్వు జేసిన పని?" అంది.

రాధ అప్పటికే నా తల పరపరా తుడుస్తూ అమ్మ సమాచారాన్నంతా చెవిలోకి మెల్లగా చేరవేసింది.

"నా మాటకేంగాని... ఎందుకమ్మా అంత నిర్లక్ష్యం? అదే... నీ ఆరోగ్యం పట్ల..." అన్నా ఆ మాట మందలింపులా లేకుండా.

ఆ అదను కోసమే ఎదురు చూస్తున్న రాధ, "అట్లా అడగరా అన్నయ్యా! మరీ వేళకింత తిండైనా తినొద్దా? ఊహూ...! బొత్తిగా మానేసింది. అదేమంటే అదోలా నవ్వుతుంది. ఎప్పుడూ ఏదో పరధ్యానం... ఏదో పరాకు... అన్నట్టీమధ్య 'లలితా... లలితా...' అని కలవరిస్తోంది. కోడలు మీదున్న మమకారం ఆమెని ఓపట్టాన వదలట్లేదు. అయినా, నువ్వు మాత్రం తక్కువ తిన్నావా? ఏదీ? వదిన్ని గూర్చి నీకు చీమ కుట్టినట్టయినా లేకపోయింది గదా! మరి నీకేమైందో?" అని చెప్పింది.

నేను మెత్తగా నవ్వాను.

అది నవ్వా?

నా నవ్వుకు సరైన అర్థం రాధకే తెలుసు. అందుకే ''సారీరా అన్నయ్యా...'' అంది బుంగమూతెట్టి...

ఎక్కడో ఉరిమింది-

వెనక్కి తిరిగి చూశాను-

కిటికీలోంచి ఉరుమును తరుముకుంటూ మెరుపు-

కరుగుతున్న మబ్బులు-

విసురుగా కొడుతున్న గాలి-

మళ్లీ వాన ప్రారంభమయింది-

పెళపెళమని ఉరుములు-

తళతళమని మెరుపులు-

ఈల వేస్తూ ఈదురుగాలి-

వాన... వాన-

వాన చినుకుల్లా కురుస్తున్న ఆలోచనలు-

లలిత... లలిత...

✦✦✦

నెల్లూరు డిగ్రీ కాలేజీలో నేను లైబ్రేరియన్‌గా పన్జేస్తున్న రోజుల్లో ఓ సాయంకాలం క్యాజువల్‌గా పరిచయమైంది లలిత! లలితప్పుడు కాలేజీ స్టూడెంటు. అప్పుడప్పుడు లైబ్రరీకొచ్చేది. పలకరింపుగా చూసేది. ఆ అరచూపుల్లో ఎంత ఆకర్షణో!

ఇంతలేసి కళ్లు. పత్తి పువ్వులాంటి నవ్వు... వయసు తెచ్చిన ఒంపుసొంపుల్తో నాజూగ్గా, గోరింట రెమ్మలా ఉండేది. అలా మా పరిచయం చాలా సాదాసీదాగా జరిగింది.



వయసులో వున్న ఓ అబ్బాయి, అమ్మాయి మధ్యన పరిచయం స్నేహమై, ప్రేమగా మారటం- అలాంటి లవ్ మ్యాచ్‌లని చాలామటుకు పెద్దలు నిరాకరించడం జరిగేదే!

కానీ మా విషయంలో అలా జరగలేదు.

జరిగింది పెళ్లే!

అలా లలిత ఇంచక్కా నా జీవితంలోకి నడిసొచ్చిన తర్వాత, మా వైవాహిక జీవితం సాచిన సీతాకోకచిలక రెక్కలా సాగిపోయింది.

సరిగ్గా అప్పుడే... మా సంతోషం మధ్యకి

మంచు తుఫానొకటి వచ్చి పడింది.

ఎప్పుడో అస్పష్టత పడ్డ మాట నిజమేగానీ, అది మళ్లీ దాపురించి అమాంతంగా ఆర్నెల్లు నన్ను ఆరోగ్యవరం మెడికల్ సెంటర్‌లో పడేస్తుందని ఊహించలేదు. ఊహించనిది జరగడమే జీవితమైతే మా మధ్య డిఫరెన్సెస్ కూడా అపుడే మొదలయ్యాయి. మ్యారేజ్‌కు ముందు ఈ విషయం దాచానన్నది లలిత ఇల్‌ఫీలింగ్. అదే టాపిక్ మీద పదేపదే నన్ను దెప్పుతూ వచ్చింది. మెడికల్ టెక్నాలజీ ఎంతో అడ్వాన్సయిన నేపథ్యంలో అసలు అదొక వ్యాధే కాదన్నాను. అవేవీ ఆమె చెవికెక్కలేదు. కొత్తగా 'కలికి'తనమొకటి తెచ్చుకుంది. అహంభావం పెంచుకుంది. ఈ 'ఇగో' పెళ్లికి ముందు లేనేలేదు.

ఇలా రానురాను లలిత బిహేవియర్ నన్ను బాగా కలవరపెట్టింది. పుట్టింటి పలుకుబడితో వచ్చిన ఉద్యోగం ఆమెలో మరింత అహంకారాన్ని పెంచే నాటికి- చాలా దూరం వెళ్లి ఆలోచిస్తోందని తెలుసుకున్నాను. మోడరన్ లైఫ్ స్టయిల్ ఎంత ఇన్‌ఫ్లూయెన్స్ చేస్తే మాత్రం, తరచూ భర్తను ఇన్సల్ట్ చేయాలని ఎక్కడుంది? తృణీకారమే ఈవిడ ఎజెండానా? ఆ మాటే అడిగాను.

తల్లినీ, చెల్లినీ విడిచి తనతో వేరే కాపురం పెట్టేయటమేనంది. పైగా, తొలిసారిగా 'డైవోర్స్' ప్రసక్తి కూడా తెచ్చింది.

ఇంతకీ... లలిత ఓ చట్రంలో ఇమడలేక పోవడానికి కారణం అత్తింటి లేమిని నిరసించటమా? నాగరిక జీవితానికి బానిస కావటమా? తమ్ముళ్ల ప్రభావానికి లొంగిపోవటమా? ఏమైతేనేం? మెట్టినింటి బ్రతుకొక బ్రతుకే కాదని తేల్చి చెప్పేసింది. ఎంతటికి తెగించింది? అకారణంగా అమ్మ, చెల్లి మీద ఎందుకంత అయిష్టత పెంచుకుంది?... ఈ ప్రశ్నలన్నీ నన్ను బాగా కలచివేశాయి.

లలిత పెద్ద అహంకారేమీ కాదనుకున్నాను.

కానీ బయటకు కనిపించని ఇంకో పార్శ్వమేదో ఆమెలో దాగుంది. లేకపోతే, "ఆడది మగాడికి బానిస కాదు; కాకూడదు. ఆమెకో సొంత వ్యక్తిత్వమంటూ ఉండాలి. అది ఆర్థిక స్వాతంత్ర్యంతోనే వస్తుంది. స్వేచ్ఛ లేని జీవితం ఒక జీవితమా? అది సాధించుకోవడానికి పురుషాధిక్య సమాజాన్ని ఎదిరించడానికైనా సాహసించాలి...' అని అంటుందా? పుట్టింటికెళుతున్న చివర్రోజు వేసిన ప్రశ్నలవి. ఆ ప్రశ్నే ఆమె బ్రతుకును ఒక శేష ప్రశ్నగా మార్చేసింది.

అంత కథ నడిచాక కూడా తనని ఊరడించడానికే ప్రయత్నించా... కుదరలేదు. ఈ బ్యాంక్ బ్యాలెన్స్‌లు, ఈ ఇజాలు, వాదాలూ జీవితాన్ని నిలబెడుతాయా? ఏమైతేనేం? లలిత ఎంత తొందరగా దగ్గరయిందో అంత తొందరగానే దూరమయింది.

ఆర్నెల్ల తర్వాత... నన్ను చిత్రహింసకు గురిచేసే రోజు విడాకుల రూపంలో వచ్చింది.

✦✦✦

రాధకు పెళ్లి సంబంధం కుదిరింది.

ఆర్థిక వ్యత్యాసాలు లేని సంబంధమే!

నెల్లూరు నుండి వస్తూ, పెళ్లి ఏర్పాట్లకని తిరుచానూరులో దిగాను.

ఆ మరుసటి రోజు తిరుపతిలో రైలెక్కాను.

నిజానికి ఆనందంగా ఉండవలసిన సమయమది.

కానీ... మనసెందుకో చికాగ్గా ఉంది.

లలిత చుట్టూ అల్లుకుంటున్న ఈ ఆలోచన ఏమిటని? నెల్లూరులో ఆ రోజు రాత్రి జరిగిన సంఘటన నన్నలా కలత పెడుతోందా? ఏమో...

✦✦✦

కారణాలేవైతేనేం? విడాకులైతే ఇచ్చింది గానీ, మళ్లీ పెళ్లంటూ చేసుకోలేదు లలిత. ఏవో కొన్ని పెద్దింటి సంబంధాలు కూడా వచ్చినట్టు వినికిడి. ఆడంబరాల మీద నిజంగా వ్యామోహమున్నదయితే మళ్లీ ఎందుకు పెళ్లి చేసుకోలేదు? భ్రమలన్నీ తొలగిపోయిన తర్వాత వాస్తవ ప్రపంచంలోకి వచ్చిందా? ఏది నిజమైనా జీవితమో అనుభవం చెప్పిందా? లేక పశ్చాత్తాపానికి అహంకారం అడ్డొచ్చిందా?

ఇంతకీ అసలు నిజం ఏమిటి?

విడాకులివ్వడం వెనుక తమ్ముళ్ల 'కుట్ర'

ఉందని చాలా ఆలస్యంగా తెలుసుకున్న లలిత... ఆ తర్వాత జాగ్రత్తపడింది. అయినా, ఎన్ని ఆకులు పట్టుకుంటే ఏమిటి లాభం... చేతులు కాలాక?

మగబిడ్డలిద్దరూ జులాయి వెధవలని, ఆస్తిపాస్తుల్ని మింగేస్తారని, లలిత తల్లిదండ్రులు ముందుచూపుతో కూతురు పేర సగం ఆస్తిని రిజిష్టరు చేయించారు. వాళ్లు ఊహించినట్టే జరిగింది. తమకు దక్కిన ఆస్తి వ్యసనాలకు తగలేసి అక్క పేర ఉన్న ఆస్తి మీదకు విరుచుకు పడ్డారు. దానికి నిజమైన వారసులు తామేనని ఎదురు తిరిగారు.

ఆర్థిక సంబంధాలు అనుబంధాల్ని తెంచే స్థాయికి దిగజారిన తర్వాత లలిత పరిస్థితి చాలా ఇరకాటంలో పడిపోయింది.

చాలామంది డబ్బే జీవితమని అనుకుంటారు.

డబ్బే జీవితమా...?

ఇందులో వున్న నిజం ఎంత?

కటిక దరిద్రంతో కుమిలేవాళ్లు పూటపూటకు తిండి కోసం తంటాలు పడితే- కరెన్సీ కట్టల మీద కూచున్న వాళ్లు తిన్నది అరక్క ఉన్నది కాపాడుకోలేక నిమిష నిమిషానికి ఛస్తుంటారు.

తిండి కోసం ఏడ్వడమూ వద్దు. తిన్నది వంటబట్టక అఘోరించడమూ వద్దు. నిజానికి వాళ్లెవరూ లైఫ్‌ని 'టేస్ట్' చేయలేరు. 'నార్మల్ లైఫ్'లో ఉన్న ఎంజాయ్‌మెంట్ ఇంక దేనిలోనూ లేదు. అదంతే...!

ఆ రోజు ఏం జరిగిందంటే...?

మందు మీదున్న తమ్ముళ్లిద్దరూ ఇద్దరమ్మాయిలతో ఇంటికొచ్చినపుడు- చిన్న గొడవ జరిగింది. దాన్ని చిలికి చిలికి గాలివాన చేస్తేగానీ తమ పబ్బం గడవదని లలితని స్పృహ తప్పేలా కొట్టారు. స్పృహ రాగానే ఆస్తి పత్రాల మీద సంతకం చేయించుకున్నారు. చివర్న కొట్టి బజార్న పడేశారు.

గుంపులు గుంపులుగా ఉన్న జనాన్ని చూచి ఆటో ఆపమన్నాను.

ఎవరో ఆడమనిషి... ఒళ్లంతా గాయాలు... పైగా హెడ్ ఇంజ్యూరీ...

అంబులెన్స్ వచ్చి ఆగింది.

వెల్లకిలా తిప్పారు.

లలిత...!

ఆమె లలితేనని గుర్తుపట్టేసరికి నాకు మతిపోయినంత పనైంది. నేనూ ఆ హాస్పిటల్‌కి వెళ్లాను. రెండు గంటలగ్గానీ స్పృహ రాలేదు. డాక్టర్ బయటికొచ్చాడు.

"షి ఈజ్ అవుటాఫ్ డేంజర్"

అలా ఊహించని విధంగా ఎదుటనున్న నన్ను చూసి గుర్తుపట్టింది. పట్టీ పట్టగానే మళ్లీ స్పృహ తప్పింది.

నిజానికి లలితప్పుడు నాకేమీ కాదు.

కాకపోయినా కన్నీళ్ల మధ్య నించున్న మనిషి పట్ల సానుభూతి చూపటం తప్పు కాదు. అలా కాస్త పరిచర్యలు చేస్తుంటే- కేసు స్టడీ చేస్తున్న డ్యూటీ డాక్టర్, "ఆమె మీకేమవుతారు?" అనడిగాడు.

"ఒకప్పుడు, ఇప్పుడేమీ కాదు" అన్నాను.

ఆయన కాస్త విస్తుబోతూ, "ఎనీహౌ. ఇంటికి తీసికెళ్లే ప్రయత్నం చెయ్యకండి. మెంటల్లీ షి ఈజ్ డిప్రెస్డ్. పేషెంట్‌కి బాగా రెస్ట్ అవసరం" అన్నాడు.

ఆయన వెళ్లిన రెండు నిముషాలకి సిస్టర్ మందిచ్చింది. గంట తర్వాత లలితకి కొంచెం స్వస్థత చిక్కింది. అదే చూపు... అదే నవ్వు... అయితే వాటిలో మెరుపు లేదు.

"అత్తయ్య బాగుందా? రాధకు పెళ్లయిందా?" అనడిగింది.

నా నుండి ఏ సమాధానమూ లేకపోయేసరికి, మళ్లీ తనే "సారీ... ఇంకా ఆ బంధాలెక్కడివి?" అని చెంపలు తుడుచుకుంది. ఇప్పటివరకు నన్నో కోరిక వేధిస్తుండేది. కళ్లారా మిమ్మల్ని చూశాక ఆ ముచ్చటా తీరిపోయింది.

ఇంకా మౌనంగా ఉండటం ఇష్టంలేక, "అలా మాట్లాడకు లలితా!" అన్నాను.

"నో... నా పట్ల సానుభూతి చూపకండి. భరించలేను... కానీ ఒకటి మాత్రం నిజం... ఎంత అహంకారంతో మిమ్మల్ని పోగొట్టుకున్నానో, ఆ పోగొట్టుకున్న దాని విలువెంతో ఇపుడు పూర్తిగా తెలిసొచ్చింది."

"అట్టే మాటాడకు" అన్నాను మళ్లీ.

అయితే, మాటాడితే గాని ఆ ఆవేదన చల్లారేట్టు లేదు.

''నేను మళ్లీ మీ జీవితంలోకి రావాలనుకోవటం లేదు. ఆ అర్హత ఎప్పుడో పోగొట్టుకున్నాను. అయితే, శూన్యమైన ఈ బ్రతుకులో మిగిలింది ఒకే ఒక సంతృప్తి... ఇది కుక్కలు చింపిన విస్తరి కాలేదు. కానివ్వలేదు...'' అని అంటున్నప్పుడు ఆమె కళ్లు మాత్రం ఈసారి ఎంతో తృప్తిగా మెరిశాయి.

"అమ్మ నిన్ను కలవరించని రోజు లేదు లలితా! ఇప్పటికీ ఆమె ధ్యాసంతా నువ్వే. తెలుసు కదా! రాధకు కూడా నువ్వంటే..."

ఆ మాటలకు ఆమె షాకయింది.

అప్పుడే వచ్చిన సిస్టర్, "పేషెంటుకి బాగా రెస్ట్ అవసరం. అట్టే డిస్టర్బ్ చెయ్యకండి. ప్లీజ్..." అంది.

ఆ సాయంకాలానికి గాని 'రాధ పెళ్లి విషయం' ఆమె చెవిన వేయలేకపోయాను.

ఎంత ఆశ్చర్యం!

జీవితంలో అంతకంటే ఆనందించదగ్గ విషయం మరోటి లేనట్టు పొంగిపోయింది.

"రాధ పెళ్లికి నువ్వు తప్పక రావాలి" అన్నాను.

''నో... రాను-'' అంది దుఃఖాన్ని నిగ్రహించుకుంటూ.

"డాక్టర్ చెకప్‌కి వస్తున్నారు. కాసేపు బయట వెయిట్ చేయగలరా?" అంది సిస్టర్ లోపలికొస్తూ.

✦✦✦

పెళ్లి ఏర్పాట్లు ముమ్మరంగా జరిగాయి.

ఆ రోజే పెళ్లిరోజు! ముహూర్తం ముందు... నేరుగా పోస్ట్‌మాన్ నా ముందుకొచ్చి నిలబడ్డాడు. సంతకం చేసి కవరందుకున్నాను.

"సౌభాగ్యవతి రాధకు. శుభాశీస్సులు!

ఈ వదిన కాని వదిన చిన్న పెళ్లికానుక..."

ఆ రెండో కాగితం మూడు లక్షలకు చెక్కు!

అవాక్కైపోయాను-

భయంకరమైన నిశ్శబ్దం-

నిశ్శబ్దాన్ని చీల్చుతూ సైకిలొచ్చి నిలిచింది-

"టెలిగ్రామ్..."

ఝళిపించినట్టు మెరుపు-

జడుసుకునేలా ఉరుము-

వణికే చేతుల్తో టెలిగ్రామ్ అందుకున్నాను-

"లలిత ఎక్స్‌పైర్డ్..."

భయంకరంగా గర్జిస్తూ ఎక్కడో పిడుగు పడింది.

○

---

# అగ్నిదేవుడు మానవుడు

తన హృదయాన్ని తూట్లు తూట్లుగా
పలుగులతో పొడిచి, పారలతో చీల్చే మనిషికి
తియ్యని జలధారనిస్తుంది పుడమి-
పచ్చని తన కొమ్మల్ని నరికి పోగులుపెట్టే
కట్టెలవాడి గొడ్డలికి, కర్రనందిస్తుంది చెట్టు-
సూదుల్తో తమ గుండెల్ని పొడిచినా,
గొంతులకు దారాల ఉరులు బిగించినా
వారికేమేని నెత్తావి ధారపోస్తాయి విరులు-
స్వార్థ త్యాగానికి మారుపేరులు-
మరి మనిషి?
సుఖంగా విశ్రమిస్తూ, ఎంత హాయి ఈ నీడ
పట్టున
అనుకుంటాడు మానవుడు
తనని గ్రీష్మతాపాన్నుంచి రక్షించే చెట్టు పేరైనా
తలపెట్టని కృతఘ్నుడు- నిజం, నిజం
నెయ్యి పోసే చెయ్యినే కాల్చే
అగ్నిదేవుడు మానవుడు.

**- జానకీ జాని**

Edited, Printed and published by Anil Inaganti for Monica Publications, 79B, Journalists Colony, Jubilee Hills, Hyderabad - 500 033. E-mail: patrika@hotmail.com. Printed at Dharani Printers, 6-3-985, Yousuf Building, Khairatabad, Hyderabad - 500 004.